సాక్షి జనగామ

మంగళవారం । 11 । మార్చి । 2025




గవర్నర్ రాకకు ఏర్పాట్లు

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఎస్‌ఎస్‌తాడ్వాయి మండలం కొండపర్తిలో నేడు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. - 8లో ▸



తెలంగాణకు పట్టిన గ్రహణం..

రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన గ్రహణం అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. - 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36°/21°

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అధిక వేడి, ఉక్కపోత ఎక్కువ అవుతుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత తగ్గుతుంది.



న్యూస్‌రీల్

వైభవంగా ధ్వజారోహణం



వేంకటేశ్వరాలయంలో పూజా కార్యక్రమం

చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ధ్వజారోహణం, గరుడముద్ద కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతులు, ఉద్యోగులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

శ్రీతిరుమలనాథస్వామి దేవాలయంలో..

స్టేషన్‌ఘన్‌పూర్: శ్రీతిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక ఆలయంలో సోమవారం ప్రధాన అర్చకులు కలకోట రామానుజచార్యులు, రంగాచార్యులు ఆధ్వర్యాన ధ్వజారోహణం, గరుడ ముద్ద, హోమం, బలిహరణం, దేవతాహ్వానం, భేరీపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

26న ఢిల్లీలో ధూం ధాం



జనగామ రూరల్: కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న ఢిల్లీలో వందలాది మంది కళాకారులచే 'ధూం ధాం' నిర్వహిస్తున్నట్లు కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరశురామ్ అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన 'చలో ఢిల్లీ' సన్నాహక సదస్సులో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ కారణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడిందని, అలాంటి మహనీయుడి ఫొటో నోట్లపై ముద్రించకపోవడం ఆయనను విస్మరించడమే అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పులి శేఖర్, పిడుగు ఆశీర్వాదం, తిప్పరపు ప్రసాద్, తాళ్లపల్లి ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ ఉద్యోగులకు సత్కారం



జనగామ: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యుత్ శాఖలో ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసపత్రాలు అందుకున్న అధికారులు జ్యోతిర్మయి, భువనేశ్వరి, సోనియాను ఎస్‌ఈ టి.వేణుమాధవ్ సోమవారం సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్ గణేష్, ఎస్‌ఏఓ జయరాజు, టెక్నికల్ ఏడీఈ తదితరులు పాల్గొన్నారు.

88 మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 88 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ విద్యాధికారి కె.జితేందర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 4,132 విద్యార్థులకు గాను 4,044 పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు. నర్మెట, జనగామ పరీక్ష కేంద్రాలను డీఐఓ, జఫర్‌గఢ్, ఘన్‌పూర్ సెంటర్లను ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు సందర్శించారు.

యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లను సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరికి మంచి ధర రావాలంటే రైతులు ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకురావాలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి నిరంతర పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. డైరెక్టర్లు నాగబండి రవీందర్, నామాల శ్రీనివాస్, బన్సీ నాయక్, బొట్ల నర్సింగరావు, అడ్తి అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకన్న పాల్గొన్నారు.



పక్క ఫొటోలోని వృద్ధ దంపతులు వెంకటకృష్ణయ్య, బుచ్చమ్మది చిల్పూరు మండలం శ్రీపతిపల్లి. వీరికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రెండో కుమారుడు రంగయ్య ఇల్లరికం వెళ్లగా, మిగతా వారు ఊరిలోనే ఉంటున్నారు. ఆరు నెలల క్రితం ప్రమాదం జరగ్గా వెంకటకృష్ణయ్య కాలు తొలగించారు. అప్పటి నుంచి ఆ దంపతులకు కష్టాలు మొదలయ్యాయి. అప్పటికే ముగ్గురు కుమారులు ఉన్న భూమి పంచుకుని తల్లిదండ్రులకు బువ్వ పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తుండడంతో ఆ పండుటాకులు న్యాయం కోసం తహసీల్దార్, ఆర్డీఓను ఆశ్రయించారు. 'కొడుకులు అన్నం పెట్టడంలేదు.. ఓ చిన్న గదిలో వండుకుంటున్నాం' అంటూ ఆ దంపతులు కలెక్టర్‌తో తమ కష్టాలు చెప్పుకుని విలపించారు. 'ఆర్డీఓకు ఆదేశాలు ఇచ్చా.. వారం రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది.. వెళ్లి కలవండి' అంటూ కలెక్టర్ వారికి భరోసా కల్పించారు.



కూతురుతో శ్రీలత

తోడబుట్టిన వారే కష్టపెడుతున్నరు..

జనగామ పట్టణంలోని శివాలయం వీధికి చెందిన గంట శ్రీలతకు పెళ్లి సమయంలో 50 గజాల స్థలాన్ని పుట్టింటి వారు కట్నం కింద ఇచ్చారు. ఏడు సంవత్సరాల క్రితం భర్త యోగానందు చనిపోవడంతో శ్రీలత ప్రైవేట్ స్కూల్‌లో పని చేస్తూ తన కూతురును పోషించుకుంటున్నది. ఓ బ్యాంకులో రుణం తీసుకుని ఉన్న కొద్ది స్థలంలో ఇల్లు కట్టుకున్నది. రెక్కల కష్టంతో నిర్మించుకున్న ఇంటి స్థలం ఇచ్చేయాలంటూ సోదరులు ఇబ్బందులకు గురి చేస్తుండడంతో ఆ అభాగ్యురాలు కలెక్టరేట్ మెట్లెక్కింది. ఇదిలా ఉండగా.. పెద్ద దిక్కు లేకపోవడంతో తల్లిదండ్రులు సైతం శ్రీలత వద్దే ఉంటూ ధైర్యం చెబుతున్నారు. కూతురు కష్టాలు చూడలేక ఆ దంపతులు రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోవడానికి రైల్వేట్రాక్ వద్దకు వెళ్లగా గమనించిన స్థానికులు కాపాడారు. కూతురుకు న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు.

ఒక్కొక్కరిది ఒక్కో సమస్య

పరిష్కరించాలని కలెక్టర్‌కు మొర పెట్టుకున్న జిల్లా ప్రజలు

- గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు 73
- 60శాతం భూ సమస్యలపైనే..
- అధికారులు అలసత్వం వహించొద్దు : కలెక్టర్ రిజ్వాన్ బాషా



గ్రీవెన్స్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్

జనగామ/జనగామ రూరల్: 'కొడుకులు ఇంట్ల నుంచి పొమ్మంటున్నరు. బుక్కెడు బువ్వ పెట్టడం లేదని వృద్ధ దంపతులు.. కట్నం కింద ఇచ్చిన స్థలాన్ని తిరిగి ఇవ్వమంటున్నారని ఓ మహిళ.. భూ సమస్య పరిష్కారానికి తిరుగుతున్నా తహసీల్దార్లు పట్టించుకోవడం లేదని మరో వ్యక్తి.. పట్టాదార్ పుస్తకం ఉంది. పహాణీలో పేరులేదు. తప్పులు సరి చేయాలని ఇంకొకరు' ఇలా.. ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య.. పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్ రిజ్వాన్‌బాషా ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో నాలుగు వారాల తర్వాత సోమవారం కలెక్టరేట్‌లో పునఃప్రారంభమైన గ్రీవెన్స్‌కు 73 మంది వివిధ సమస్యలపై అర్జీలతో వచ్చారు. వాటిని అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, ఆర్డీఓ గోపీరాం తదితర అధికారులతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన వినతుల్లో 46 భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ శాఖవే ఉండడం గమనార్హం. మండలాల పరిధిలో తహసీల్దార్, రెవెన్యూ వ్యవస్థ ఉన్నప్పటికీ చిన్న సమస్య కూడా పరిష్కరించలేని పరిస్థితి ఉందనే విషయం గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారులతో తెలుస్తోంది. గ్రీవెన్స్ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆయన అన్ని మండలాల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఫిర్యాదుల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. పరిశీలనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రీవెన్స్‌లో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్‌నాయక్, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డీఏఓ రామారావునాయక్, సీపీఓ పాపయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ వసంత, డీపీఓ స్వరూప, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ కోసం పాట్లు..



వీల్‌చైర్‌లో కలెక్టరేట్‌కు వస్తున్న యాదమ్మ

రఘునాథపల్లి మండలం కోడూరుకు చెందిన కందుకూరు యాదమ్మ–కిష్టయ్య దంపతులు ఉన్నంతలో హాయిగా బతుకుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఓ ప్రమాదంలో భర్త కాలు పోవడంతో భార్య అన్నీ తానై కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. యాదమ్మ సైతం పక్ష వాతంతో మంచాన పడింది. కేవలం భర్త పింఛన్‌పైనే జీవనం గడుస్తోంది. వైద్య పరీక్షలు, మందులు, కుటుంబ పోషణ దిన దిన గండంగా మారింది. భార్యకు కూడా పింఛన్ వస్తే ఆసరాగా ఉంటుందని ఒంటి కాలుతోనే కిష్టయ్య కలెక్టరేట్, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

కుంటకు గండి.. బోర్లు, బావులు ఖాళీ



పెద్దమడూరు గ్రామంలోని పీర్లావాయికుంట ఆరు ఎకరాల విస్తీర్ణంలో జలకళతో ఉండేది. మూడేళ్ల క్రితం గండి పడింది. గోదావరి జలాలు, వరద నీళ్లు ఇచ్చినా.. నిమిషాల్లో ఖాళీ అయిపోతున్నాయి. కుంటకింద 20 బోర్లు, ఐదు బావులపై ఆధారపడి సుమారు 20 మందికి పైగా రైతులు పంటల సాగు చేస్తున్నారు. గండిని పూడ్చాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి, బోర్లు, బావులు ఎండిపోయాయి. 'వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు ఎండిపోయి నష్టపోతున్నాం. సమస్య పరిష్కరించాలి' అని రైతులు కోరారు.

- పెండెల దశరథ, రుద్రోజు ఉప్పలయ్య, రైతులు, పెద్దమడూరు(దేవరుప్పుల)

పట్టాలో పేరుంది.. పహాణీలో లేదు



మా తల్లి పోచమ్మ పేరిట ఒక ఎకరం ఎనిమిది గంటల భూమి ఉంది. ఇందుకు సంబంధించిన పట్టాదార్ పుస్తకం ఉంది. పహాణీలో తల్లి పేరు కాకుండా.. మరో వ్యక్తి వివరాలను నమోదు చేశారు. దీంతో పెట్టుబడి సాయం అందడం లేదు. చిన్న సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. తహసీల్దార్ వద్దకు వెళ్లినా పని కావడంలేదు. ప్రస్తుతం భూమి మేమే చూసుకుంటున్నాం. పేరు మార్చి న్యాయం చేయాలి.

- పసికి రాంనరసయ్య, యశ్వంతాపూర్(జనగామ)

కూతురు, అల్లుడు కలిసి భూమి కాజేశారు



నా భర్త జాటోతు సక్రు నాయక్. మాకు నలుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు. వారసత్వంగా వచ్చిన 2 ఎకరాల 37 గుంటల భూమి ఉంది. ఒక కుమార్తె, అల్లుడు కలిసి బెదిరించి ఆ భూమిని అక్రమంగా వారి పేర చేసుకున్నారు. బతుకు దెరువుకు ఆధారంగా ఉన్న స్థలం కాకుండా పోవడంతో ఐదేళ్లుగా పోలీస్‌స్టేషన్, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు.

- జాటోతు దాలి, పగులతండా(కొడకండ్ల)

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించాలి

- అధికారులు సమయపాలన పాటించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఫోన్ చేసి ఈనెల 31 వరకే రాయితీ వర్తిస్తుందనే విషయం తెలియజేయాలని చెప్పారు. తాగు నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎంపిక చేసిన మోడల్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. జిల్లా, మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని చెప్పారు. అధికారులు సమయపాలన పాటించాలని, సిబ్బందికి బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి చేయాలని పేర్కొన్నారు. నియమాలను అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. సమీక్ష సమావేశంలో జనగామ, ఘన్‌పూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్‌నాయక్, జనగామ ఆర్డీఓ గోపీరాం, డీఆర్‌డీఓ వసంత, సీపీఓ పాపయ్య, డీపీఓ స్వరూప, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డీఏఓ రామారావునాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించాలి : వీసీలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల

జనగామ: దేవాదుల ప్రాజెక్టు కింద సాగయ్యే చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం సచివాలయం నుంచి సాగు నీటి నిర్వహణ, సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ పి.గోపితో కలిసి కలెక్టర్లు, పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడారు. పంటలు ఎండిపోకుండా నీటి పారుదల, వ్యవసాయ, విద్యుత్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వీసీలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ పండరి చేతన్‌నితిన్, డీఏఓ రామారావు నాయక్, మిషన్ భగీరథ(ఇంట్రా) ఈఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



సన్మానం పొందిన కార్మికులతో కలెక్టర్ తదితరులు

జనగామ రూరల్: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, వారు ఐక్యంగా ఉంటే అద్భుతాలు సృష్టించగలరని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు ఇంటా, బయట సమానత్వంతో పాటు జీవితంలో ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఆడ, మగ మధ్య వ్యత్యాసం చూడకూడదని, 80 శాతం మహిళలే జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని పేర్కొన్నారు. వ్యాపార, వృత్తి, ఉపాధి రంగాల్లో మహిళ పాత్ర గణనీయమని, ఆడపిల్లను తల్లితండ్రులు తప్పనిసరి చదివించి వారికి అండగా నిలవాలని సూచించారు. అనంతరం ఐడీఓసీని పరిశుభ్రంగా ఉంచుతున్న మహిళా శానిటేషన్ సిబ్బందిని, మున్సిపల్ మహిళా పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి బహుమతులు అందజేశారు. కేక్ కట్ చేసిన అనంతరం వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉత్తమ మహిళా ఉద్యోగులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి ఫ్లోరెన్స్, డీపీఓ స్వరూప, డీఆర్డీఓ వసంత, డీఎంహెచ్‌ఓ మల్లికార్జునరావు, జౌళి శాఖ అధికారి చాడేశ్వరి, జెడ్పీ సీఈఓ మాధురీ కిరణ్‌చంద్రషా, డిప్యూటీ సీఈఓ సరిత, సీడీపీఓ రమాదేవి, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ హెచ్.శారద, టీజీఓస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, టీఎన్జీఓస్ ప్రెసిడెంట్ ఖాజా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల గోస పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



బచ్చన్నపేటలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న జాన్ వెస్లీ తదితరులు

జనగామరూరల్/స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి/బచ్చన్నపేట/జఫర్‌గఢ్/పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: ఒకవైపు పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గోస పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం ఆయన జిల్లాలో పర్యటించారు. వివిధ మండలాల్లో ఎండిన పంటలను, జఫర్‌గఢ్‌లో అసంపూర్తిగా ఉన్న దేవాదుల కాల్వలను, పాలకుర్తిలో రిజర్వాయర్ల పనులను పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రం, ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ గండిరామవరం, బొమ్మకూరు, చిటకోడూరు, నవాబ్‌పేట, ఆర్‌ఎస్సార్ ఘనపూర్, అశ్వరావుపల్లి, కన్నబోయినగూడెం, వెల్దండ రిజర్వాయర్లలో ఫిబ్రవరి మొదటి వారంలోనే నీరు అడుగంటి కాల్వల్లో నీరులేక పంటలు ఎండిపోయే దశకు వచ్చాయన్నారు. జిల్లాలో 1లక్ష 66 వేల ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తే ఇప్పటికే 45శాతం సాగునీరు అందక పొలాలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి జలాలు రాక భూగర్భ జలాలు అడుగంటి రైతులు అరిగోస పడుతున్నారని, చెరువులు కుంటలు నింపి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు అప్పులు తెచ్చి వరి వేస్తే ఫలితం లేకుండా పోయిందని, ప్రభుత్వం బాధ్యత వహించి ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్‌కు వస్తున్నందున ముందే ఎండిన పంటలపై సర్వే నిర్వహించి నష్టపరిహారంపై ప్రకటన చేయాలన్నారు. జాన్‌వెస్లీ వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్, జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, రాపర్తి రాజు, ఇరి అహల్య, యాదగిరి, రమేష్, శేఖర్, వెంకటేష్, విజేందర్, ఎల్లయ్య, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు. ఇదిలా ఉండగా.. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కటించాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఇక్కడి నిరుద్యోగులకోసం పరిశ్రమలు నెలకొల్పాలన్నారు.

పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి

- 24 గంటలు ప్రజలకు అందుబాటులో
- నూతన సీపీ సన్‌ప్రీత్‌సింగ్
- బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్



సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పూర్వ సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లానుంచి బదిలీపై వచ్చిన ఆయన.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సాయుధ పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. డీసీపీలు, అదనపు డీసీపీలు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్‌గా పూర్వ సీపీ అంబర్ కిషోర్ ఝూనుంచి బాధ్యతలు స్వీకరించారు. అంబర్ కిషోర్ ఝూ.. నూతన సీపీకి పూలబొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వందశాతం శాంతి భద్రతలను కాపాడుతామని, ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగే విధంగా ఇరువై నాలుగు గంటలు ప్రజల కోసం పనిచేస్తామన్నారు. ప్రధానంగా నేరాల నియంత్రణతోపాటు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అయిన సైబర్ క్రైం, మత్తు పదార్థాల కట్టడితోపాటు మత్తు పదార్థాలను వినియోగించేవారు, విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. రాబోయే రోజుల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులను మరింత బలోపేతం చేస్తామన్నారు. అభినందనలు తెలిపిన వారిలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్ కుమార్, ఏఎస్పీ చైతన్య, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.

బాధ్యతగా పనిచేయాలి: సీపీ



సీఎం సభాస్థలి వద్ద పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 16న స్టేషన్‌ఘన్‌పూర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసు అధికారులు భద్రత ఏర్పాట్లపై బాధ్యతగా పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం శివునిపల్లి పాలకుర్తి రోడ్డులో నిర్వహించే సీఎం బహిరంగ సభాస్థలంతో పాటు పార్కింగ్ స్థలాలు, హెలిప్యాడ్ ప్రాంతాన్ని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డివిజన్ పోలీసు అధికారులతో మాట్లాడారు. సీఎం పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌ను సీపీ సందర్శించారు. నమోదైన కేసులు, దర్యాప్తు వివరాలు, రికార్డుల గదులను పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణలో మొక్కల పెంపకం, పచ్చదనాన్ని చూసి పోలీసులను అభినందించారు. సీపీ వెంట డీసీపీ రాజమహేంద్రనాయక్, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐలు జి.వేణు, ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు నరేష్, వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సభాస్థలాన్ని పరిశీలించిన ఆర్‌డీఓ

శివునిపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభ నిర్వహించనున్న స్థలాన్ని ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న సోమవారం పరిశీలించారు. స్థలం చదును తదితర పనుల గురించి ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచనలు చేశారు.

నెహ్రూపార్కు ఏరియాలో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్

జనగామ: ఎల్ఆర్ఎస్(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)కు సంబంధించి ప్రభుత్వ విధివిధానాలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడంతో పాటు వారికి అవగాహన కల్పించేందుకు జనగామ మున్సిపల్ అధికారులు నెహ్రూపార్కు ఏరియాలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ విధానంలో వచ్చిన మార్పులు, ప్లాట్లను ఎలా రెగ్యులరైజ్ చేసుకోవాలనే దానిపై హెల్ప్‌డెస్క్ సిబ్బంది వివరిస్తున్నారు.

నీరు, గడ్డి లేక గోవుల మృతి

- గోసంరక్ష ప్రముఖ్ గుమ్మడవెల్లి శ్రీనివాస్



ఎస్సైకి వినతిపత్రం ఇస్తున్న గోసంరక్ష బాధ్యులు

పాలకుర్తి టౌన్: గోశాలలో సరైన తాగునీరు, గడ్డి అందుబాటులో లేక గోవులు మృతి చెందాయని గోసంరక్ష ప్రముఖ్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, రాష్ట్రీయ హిందూ పరిషత్ అధ్యక్షుడు భూపాల్, లీగల్ కమిటీ ప్రముఖ్ అడ్వకేట్ అనిత ఠాకూర్ అన్నారు. మండల కేంద్రంలోని గోశాల నిర్వాహకుల నిర్లక్ష్యంతో గోవులు చనిపోతున్న విషయం తెలుసున్న వీరు సోమవారం గోశాలను సందర్శించి వివరాలను సేకరించారు. అర్హులైన రైతులకు గోవులను ఇచ్చేలా చూడలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. హిందూ పరిరక్షణ సమితి, గోసంరక్షణ జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ ప్రముఖ్ పసునూరి సందీప్, నగేష్, స్వామి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌-1లో మెరిసిన గిరిజన ఆణిముత్యం



పవన్‌ కల్యాణ్‌

గార్ల: గిరిజన రైతు కుటుంబంలో పుట్టి గ్రూప్‌-1లో 900 మార్కులకు 454 మార్కులు సాధించాడు గిరిజన ఆణిముత్యం గంగావత్‌ పవన్‌కల్యాణ్‌. మానుకోట జిల్లా గార్ల మండలం పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన గంగావత్‌ లక్ష్మణ్‌, మంగ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు గంగావత్‌ పవన్‌కల్యాణ్‌ హైదరాబాద్‌ పబ్లిక్‌ స్కూల్‌లో 1 నుంచి ఇంటర్‌ వరకు చదివాడు. 10వ తరగతిలో 10/10 జీపీఏ సాధించడమే కాకుండా ఇంటర్‌లో ఎంఈసీ గ్రూప్‌లో పబ్లిక్‌ స్కూల్లో టాపర్‌గా నిలిచాడు. అనంతరం ఢిల్లీ యూనివర్సిటీలోని హిందూ కళాశాలలో డిగ్రీలో సీటు సాధించి బీఏ ఎకనామిక్స్‌ పూర్తిచేశాడు. ఎలాంటి కోచింగ్‌ తీసుకోకుండానే గ్రూప్‌-1 పరీక్ష రాసిన పవన్‌కల్యాణ్‌ ఉత్తమ ఫలితం సాధించాడు. ఎస్టీ విభాగంలో కాకుండా ఓపెన్‌ కోటాలోనే డిప్యూటీ కలెక్టర్‌ పోస్టు వస్తుందని పవన్‌కల్యాణ్‌ ధీమా వ్యక్తం చేశాడు. పవన్‌కల్యాణ్‌ను గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

జశ్వంత్‌రాజ్‌ ప్రతిభ



మహబూబాబాద్‌ అర్బన్‌: సోమవారం విడుదలైన గ్రూప్‌ వన్‌ ఫలితాల్లో మానుకోట జిల్లా కేంద్రంలోని సంఘాల రవికుమార్‌ ప్రసన్న దంపతుల కుమారుడు సంఘాల జశ్వంత్‌ రాజ్‌ 900 మార్కులకు 465 మార్కులు సాధించాడు. గ్రూప్‌ వన్‌లో అత్యధికంగా మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టెన్త్‌ స్పాట్‌ విధుల రెమ్యునరేషన్‌ చెల్లించండి

- డీఈఓకు టీఆర్‌టీఎఫ్‌ వినతి

విద్యారణ్యపురి: గత ఏడాది ఉమ్మడి వరంగల్‌ జిల్లా కేంద్రం హనుమకొండలో టెన్త్‌ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకణంలో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు నేటికీ రెమ్యునరేషన్‌ చెల్లించలేదు. తెలంగాణ రాష్ట్ర టీచర్స్‌ ఫెడరేషన్‌ (టీఆర్‌టీఎఫ్‌) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బాసిరి రాజిబాపురావు, జనరల్‌ సెక్రటరీ గుగులోతు శ్రీనివాస్‌నాయక్‌లు సోమవారం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రెమ్యునరేషన్‌తోపాటు టీఏ, డీఏలు చెల్లించలేదని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈఏడాది ఏప్రిల్‌లో కూడా టెన్త్‌ విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఉంటుందని కానీ, గత ఏడాదికి సంబంధించిన రెమ్యునరేషనే ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే రెమ్యునరేషన్‌ చెల్లించాలని లేదంటే ఈఏడాది నిర్వహించబోయే స్పాట్‌ వాల్యుయేషన్‌ను ఉపాధ్యాయులు బహిష్కరించాల్సి వస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

క్రీడల్లోనూ పిల్లలను ప్రోత్సహించాలి

వరంగల్‌ స్పోర్ట్స్‌: పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని సీనియర్‌ సివిల్‌ జడ్జి క్షేమదేశ్‌పాండే తల్లిదండ్రులకు సూచించారు. వరంగల్‌ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ బస్టాండ్‌ సమీపంలోని శ్రీహర్ష కన్వెన్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ఓపెన్‌ టు ఆల్‌ ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా సీనియర్‌ సివిల్‌ జడ్జి క్షేమదేశ్‌ పాండే, విశిష్ట అతిథిగా కన్వెన్షన్‌హాల్‌ డైరెక్టర్‌ వేణు హాజరై విజేతలకు బహుమతులను అందజేసి, మాట్లాడారు. టోర్నమెంట్‌ నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఓపెన్‌ టు ఆల్‌ విజేతగా అల్లాడి శ్రీవాత్సవ్‌ నిలవగా వరుస స్థానాల్లో రిత్విక్‌ గండు, షేక్‌ రియాజ్‌, స్వాతి దేవరపల్లి, ఎం.దీక్షిత్‌ నిలిచినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చీఫ్‌ ఆర్బిటర్లు, తదితరులు పాల్గొన్నారు.

10 హాస్టళ్లు.. 1,250 మంది విద్యార్థులు

కాకతీయ మెడికల్‌ కళాశాలలో ఐదు బాయ్స్‌ హాస్టల్స్‌లో 480 మంది, ఐదు మహిళా వసతి గృహాల్లో 770 మంది మెడికోలు ఉంటూ వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. 1,250 మంది విద్యార్థుల సౌకర్యార్థం సెక్యూరిటీ, శానిటేషన్‌ వ్యవస్థ ఎప్పటికప్పుడు నిర్వహించేందుకు 86 మంది కార్మికులను అధికారుల నియమించారు. వీరికి గత ఎనిమిది నెలలుగా ప్రభుత్వం వేతన బడ్జెట్‌ మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చేసేదేమీ లేక కార్మికులు ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

కేఎంసీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు



కంపు కంపు!

విధులు బహిష్కరించిన కేఎంసీ హాస్టళ్ల కార్మికులు

- ఇబ్బందులు పడుతున్న 1,250 మంది విద్యార్థులు

ఎంజీఎం : ప్రభుత్వ నిర్లక్ష్యం.. వేతనాల కోసం కార్మికులు చేపట్టిన ఆందోళనతో కాకతీయ మెడికల్‌ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న మెడికల్‌ విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత కీర్తి ప్రతిష్టలు పొందిన కేఎంసీ అధ్యాపకుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో కనీసం మౌలిక వసతులు కల్పించడంలో సైతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వైద్యవిద్యపై చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. మెడికల్‌ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హాస్టళ్లలో పనిచేసే కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు విధులు బహిష్కరించి ఆందోళన చేపడుతున్నారు. 80 మందికి పైగా కార్మికులు ఆందోళన బాట పట్టడంతో హాస్టళ్లలో శానిటేషన్‌ వ్యవస్థ అధ్వానంగా మారిది.



హాస్టల్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

గత శుక్రవారం నుంచి కార్మికులు విధులు బహిష్కరించడంతో హాస్టళ్లలో పారిశుద్ధ్య సమస్య తీవ్రమైంది. కొన్ని హాస్టల్స్‌లో ఉండే సామూహిక మరుగుదొడ్లు పూర్తిగా అపరిశుభ్రంగా మారాయి. నీరునిల్వ ఉండడంతో వాడేందుకు వీలు లేని స్థితికి చేరాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు హాస్టల్స్‌ గదులను శుభ్రపరచకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శునకాల స్వైర విహారం

హాస్టల్స్‌ వద్ద సెక్యూరిటీ సిబ్బంది నిర్వహణ లేకపోవడం, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయడంలో హాస్టల్స్‌ పరిసరాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.

నీటి సమస్య ఎదుర్కొంటున్నాం..



ఓవర్‌హెడ్‌ ట్యాంక్‌లకు బోర్‌ వెల్‌ ద్వారా నీరునింపే పని కార్మికులు చేస్తుంటారు. వారు సమ్మెకు వెళ్లడంతో నీటి సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

- ఇంద్రతేజ

సమస్యను పరిష్కరించాలి..



కార్మికులకు వేతనాలు చెల్లించి హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. ఐదు హాస్టళ్లలో పెద్ద సంఖ్యలో మహిళా విద్యార్థులు ఉంటున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే హాస్టళ్లలో ఉండలేం.

- విహారిక, మెడికో

కోర్కెలు తీర్చే కల్పవల్లి..



ఫాతిమామాత గుహ వద్ద ఏర్పాట్లు

- ఫాతిమామాత మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- ముఖ్య అతిథిగా ఓరుగల్లు పీఠకాపరి ఉడుములబాల
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

కాజీపేట రూరల్‌: కాజీపేట ఫాతిమానగర్‌లోని ఫాతిమామాత ప్రజల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. చరిత్రకలిగిన ఫాతిమామాత దేవాలయం కేథడ్రల్‌ చర్చి ప్రాంగణం ఓరుగల్లు మేత్రాసనంలో ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రతి ఏటా మూడు రోజులపాటు నిర్వహించే ఫాతిమామాత మహోత్సవానికి వివిధ జిల్లాల నుంచి విశ్వాసులు, అన్ని వర్గాల ప్రజలు తరలివస్తుంటారు. ఈ ఏడాది ఓరుగల్లు పీఠంలో 2025 సాధారణ జూబిలీ సంవత్సరంలో బిషప్‌ డాక్టర్‌ ఉడుములబాల ఆశీర్వాద వేళలో మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బిషప్‌ సెక్రటరీ ఫాదర్‌ గంగారపు అనుకిరణ్‌ సోమవారం తెలిపారు. కాజీపేట మెయిన్‌రోడ్‌లో చర్చి ఎంట్రెన్స్‌ వద్ద నిర్మించిన మహాతోరణం ఆశీర్వాద ద్వారం, ప్రాంగణంలో జపమాల బృందావనం (రోజరి గార్డెన్‌)ను బిషప్‌ ఉడుముల బాల ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని కేథడ్రల్‌ చర్చి, ఫాతిమామాత గుహను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాలకు 12 జిల్లాల నుంచి 10 వేల మంది భక్తులు రానున్నట్లు తెలిపారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉడుముల బాల

మూడు రోజుల కార్యక్రమాలు..

కేథడ్రల్‌ చర్చిలో ఈ నెల 11వ తేదీన మంగళవారం మహాపూజ్య డాక్టర్‌ ఉడుములబాల దివ్యబలిపూజ సమర్పణ, దంపతులకు సన్మానం, 12వ తేదీ బుధవారం ఫాదర్‌ తాటికొండ జోసెఫ్‌, డి.జోసెఫ్‌ ఆధ్వర్యంలో స్వస్థత ప్రార్థనలు, దివ్యబలిపూజ, కర్నూల్‌ పీఠం పూజ్య ఏరువ జోజిరెడ్డిచే పూజ ప్రార్థనలు. సాయంత్రం ఫాతిమామాత స్వరూపంతో ఊరేగింపు, ఫాతిమా మాత ప్రధాన ద్వారం, రోజరి గార్డెన్‌ ప్రారంభం, కొవ్వత్తులతో దివ్యప్రసాద ప్రదక్షిణ దివ్యప్రసాద ఆశీర్వాదం. 13వ తేదీన గురువారం బెంగళూర్‌ అగ్రపీఠం మెన్సిగ్నోర్‌ సి.ఫ్రాన్సిస్‌ ఆంగ్లంలో దివ్యబలిపూజ కార్యక్రమం చేయనున్నారు. ఓరుగల్లు పీఠకాపరి అండ్‌ విశాఖ అగ్రపీఠకాపరి ఉడుములబాల సమష్టి కృతజ్ఞత సమర్పణ. సాయంత్రం 5:30 గంటలకు మూడో పూజ, గురుశ్రీ ఆశీర్వాదం, ఎస్‌.జె దివ్యపూజ పతాక అవరోహణతో ఫాతిమామాత ఉత్సవాల ముగింపు.

పోస్టర్‌ ఆవిష్కరణ

కాజీపేట: మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఫాతిమామాత ఉత్సవాలను విజయవంతం చేయాలని బిషప్‌ ఉడుముల బాల కోరారు. ఈమేరకు కాజీపేట మీడియా పాయింట్‌ ఆవరణలో స్థానిక కెథడ్రల్‌ చర్చి విచారణ గురువు ఫాదర్‌ కాసు మర్రెడ్డి ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. అనుకిరణ్‌, బొక్క దయాసాగర్‌, తాటికొండ జోసఫ్‌, సురేష్‌, నవీన్‌ ఫాదర్‌ సురేందర్‌, తదితరులు పాల్గొన్నారు.

తల్లిని హత్యచేసిన తనయుడి అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ రమేశ్‌



వివరాలు వెల్లడిస్తున్న సీఐ పులి రమేశ్‌

ఎల్కతుర్తి: కన్నతల్లిని గొడ్డలితో నరికి హత్య చేసిన తనయుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి మండల కేంద్రంలో సీఐ పులి రమేశ్‌ తన కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని వీరనారాయణపూర్‌ గ్రామానికి చెందిన చదిరం అజయ్‌ తనకు రావాల్సిన భూమి వాటాను తల్లి చదిరం రేవతి(45) పంచివ్వడం లేదన్న కోపంతో ఈనెల 7న గొడ్డలితో నరికి హత్య చేశాడు. దీంతో మృతురాలి చిన్న కుమారుడు చదిరం విజయ్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈక్రమంలో మండలంలోని కోతులనడుమ గ్రామ సమీపంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తారసపడిన అజయ్‌ని అరెస్టు చేసి, విచారింగా.. నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌, మల్లేశం, గణేశ్‌, భాస్కర్‌రెడ్డి, నిరంజన్‌ పాల్గొన్నారు.

తెలంగాణకు పట్టిన గ్రహణం సీఎం



జనగామలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- బాబుకు గురుదక్షిణతోనే.. ఎడారిగా రాష్ట్రం
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

జనగామ: తెలంగాణలో ప్రస్తుతం వచ్చిన కరువు.. కాలం తెచ్చింది కాదు.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చినదే అని, తెలంగాణకు పట్టిన గ్రహణం సీఎం అని.. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇరిగేషన్‌ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇంటికి వెళ్లి చేపల పులుసు తింటే.. బాబును ప్రజాభవన్‌కు పిలిచి అడుగులకు మడుగులు ఒత్తింది రేవంత్‌రెడ్డి కాదా.. అని ప్రశ్నించారు. కృష్ణా నదిలో రేవంత్‌రెడ్డి గురువు చంద్రబాబునాయుడు నీళ్లు దోచుకుపోతుంటే కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదని ధ్వజమెత్తారు. సీఎం, మంత్రికి బాబును ప్రశ్నించే దమ్ము, ధైర్యం లేదని, యాసంగి సీజన్‌ పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాలన చేతకాక ప్రకృతి, ప్రతిపక్షాలపై నిందలు వేసి రేవంత్‌రెడ్డి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఎండల తీవ్రతతో పంటలు ఎండిపోతుంటే కేసీఆర్‌, హరీశ్‌రావు సంతోషపడుతున్నారని సీఎం అనడం ఆయన రాజకీయ దివాలాకోరు తనానికి నిదర్శనమని అన్నారు. కేసీఆర్‌ సీఎంగా ఉన్న సమయంలో ఎండలు లేవా.. ఆనాడు ఒక్క ఎకరం ఎందుకు ఎండలేదు.. ఈ రోజు సాగు నీటి కష్టాలు ఎందుకు వచ్చాయో కాంగ్రెస్‌ ప్రభుత్వం.. ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. దేవాదుల ఓఅండ్‌ఎం కాంట్రాక్టర్‌కు రూ.7వేల కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో 33 రోజులపాటు దేవాదుల పంపు మోటార్లను ఆన్‌ చేయలేదని, రేవంత్‌ రెడ్డి చేసిన తప్పును ప్రకృతి మీద మోపి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. గోదావరిలో ప్రవాహం ప్రారంభం కాగానే మోటార్లు ఆన్‌ చేసి రిజర్వాయర్లు, చెరువులు నింపితే ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోనే లక్ష ఎకరాలు ఎండిపోయాయని, మహబూబ్‌నగర్‌, నల్గొండలో పంటలు ఎండిపోవడానికి ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం అడ్డగోలుగా కృష్ణానది జలాలను దోచుకోవడమే కారణమన్నారు. దేవాదుల ఫేజ్‌-3 మోటార్లను వెంటనే ఆన్‌చేస్తే అదనపు నీటిని తెచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వానాకాలం సీజన్‌లో కొనుగోలు చేసిన సన్నధాన్యానికి అందించే బోనస్‌ రూ.400 కోట్ల మేర పెండింగ్‌లో ఉందని తెలిపారు. ప్రస్తుతం నష్టపోయిన ప్రతీ ఎకరాకు ప్రభుత్వం రూ.20 వేల పరిహారం అందించాలని డిమాండ్‌ చేశారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో భూముల క్లియరెన్స్‌, గ్రేటర్‌ కమ్యూనిటీలకు అనుమతుల కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 20 శాతం కమీషన్లు దండుకుంటుందని ఆరోపించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో శాసన మండలి బీఆర్‌ఎస్‌ శాసన సభాపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌, పాడి కౌశిక్‌రెడ్డి, నాయకులు మేకల కలిగంరాజు, తాళ్ల సురేష్‌రెడ్డి, సంపత్‌, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మసిఉర్‌ రెహమాన్‌, సమ్మద్‌ అనిత, స్వరూప, సుధ, నాగరాజు, యాదగిరిగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండండి

- పంట చేతికందే వరకు చివరి ఆయకట్టుకు నీరందాలి
- కలెక్టర్లు, ఇరిగేషన్‌ అధికారులకు మంత్రి ఉత్తమ్‌ ఆదేశం
- మంత్రులు ఉత్తమ్‌, పొంగులేటిలతో ఎమ్మెల్యేల భేటీ



మంత్రులు ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డిలతో సమావేశమైన ఎమ్మెల్యేలు

సాక్షిప్రతినిధి, వరంగల్‌: యాసంగి పంటలు చేతికందే వరకు సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్‌, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డితో కలిసి అధికారులతో సోమవారం కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తదితరులు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి పంటలు ఎండుతున్న ప్రాంతాల్లో పరిస్థితులను వివరించారు. అనంతరం సాగు నీటి నిర్వహణ, సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించిన మంత్రి ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి.. అధికారులకు పలు సూచనలు చేశారు. నీటి పారుదల, వ్యవసాయ, విద్యుత్‌ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పంటలకు సాగు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దేవాదుల ప్రాజెక్టు కింద అత్యధికంగా వరి సాగవుతోందని, ఎగువ భాగాన రైతులు ఎక్కువ మోటార్లు పెడుతున్నారని, చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని, సాగు నీటి కొరత రాకుండా చూడాలని ఆదేశించారు.

ఎయిర్‌పోర్ట్‌ భూసేకరణకు సర్వే పూర్తి

ఖిలా వరంగల్‌: మామునూరు ఎయిర్‌పోర్ట్‌ పునరుద్ధరణకు కేంద్రం గ్రీన్‌ సిగ్నల్‌ ఇవ్వడం.. అంతకు ముందే భూ సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లు విడుదల చేయడం వేగంగా జరిగిపోయాయి. ఈక్రమంలో ఎయిర్‌ పోర్ట్‌ అథారిటీ అధికారులు రన్‌ వే పొడిగింపు కోసం 253 ఎకరాల భూమిని సేకరించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. ఈనేపథ్యంలో ఖిలా వరంగల్‌ తహసీల్దార్‌ బండి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రైతుల సహకారంతో మూడు రోజుల్లోనే భూ సర్వే పూర్తి చేశారు. రెవెన్యూ అధికారులు.. రైతుల నుంచి వ్యక్తిగత వివరాలను సేకరించారు.

పోక్సో కేసులో వృద్ధుడికి ఆరు నెలల జైలు

రఘునాథపల్లి: పోక్సో కేసులో ఓ వృద్ధుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ జనగామ పోక్సో కోర్టు న్యాయమూర్తి రవీంద్రశర్మ సోమవారం తీర్పునిచ్చారు. ఎస్సై నరేష్‌ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన డ్యాగల అలియాస్‌ గజ్జెల బుచ్చయ్య అనే వృద్ధుడు అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారయత్నం చేశాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 2023 ఏప్రిల్‌ 6న వృద్ధుడిపై పోక్సో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్‌ మోయిజుద్దీన్‌ కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శిక్ష ఖరారు చేస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు.

గవర్నర్‌ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



సిద్ధం చేసిన కుట్టు మిషన్లు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కారం పొడి మిల్లు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: తన దత్తత గ్రామమైన మండలంలోని కొండపర్తికి గవర్నర్‌ జిష్ణు దేవ్‌వర్మ నేడు (మంగళవారం) రానున్నారు. ఈనేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. కొండపర్తిలో ట్రైబల్‌వెల్ఫేర్‌ ఇంజనీరింగ్‌ డిపార్ట్‌మెంట్‌ ఆధ్వర్యంలో కమ్యూనిటీహాల్‌, పాఠశాల భవనానికి మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మాణ పనులు పూర్తి చేశారు. అంతేకాకుండా నిర్మించిన బహుళ ఉపయోగ భవనంలో కారం పొడి మిల్లు, మహిళలకు కుట్టు మిషన్లను సిద్ధం చేశారు. గవర్నర్‌ అభివృద్ధి పనులను ప్రారంభించి బిర్సాముండా, కొమురంభీం విగ్రహాలను మంత్రి సీతక్కతో కలిసి ఆవిష్కరించనున్నారు.



వేదికను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కొండపర్తిలో అధికారులు

గవర్నర్‌ రాక నేపథ్యంలో జిల్లా అధికారులు కొండపర్తి బాట పట్టారు. ఆయా శాఖల వారీగా ఏర్పాట్లు చేశారు. గర్నవర్‌ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడేందుకు వేదిక సిద్ధం చేస్తున్నారు. గ్రామంలోని రోడ్లు శుభ్రం చేసి సైడ్‌ బర్మ్‌కు మట్టి పోశారు. కొండపర్తిలో ప్రత్యేక హెల్త్‌ క్యాంపు ఏర్పాటుకు డీఎంహెచ్‌ఓ గోపాల్‌ రావు గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. ట్రైబల్‌ వెల్ఫేర్‌ ఈఈ వీరభద్రం దగ్గరుండి ఏర్పాట్లు చేయించారు. స్థానిక ఎంపీడీఓ సుమన వాణి, ఎంపీఓ శ్రీధర్‌రావు పరిశుభ్రత ఏర్పాట్లను సిబ్బందితో చేయించారు. ఇదిలా ఉండగా.. సోమవారం సాయంత్రం కలెక్టర్‌ దివాకర ఏర్పాట్లను పరిశీలించారు.

పీహెచ్‌సీలో అత్యవసర గది ఏర్పాటు

గవర్నర్‌ కొండపర్తికి వస్తున్న నేపథ్యంలో ప్రోటోకాల్‌ ప్రకారం తాడ్వాయి పీహెచ్‌సీలో అత్యవసర గదిని సిద్ధం చేశారు. ఈ గదిలో రెండు పడుక మంచాలు, మెడికల్‌ కిట్లను అందుబాటులో ఉంచారు. డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు గదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ రణధీర్‌, వైద్యాధికారి అడెపు చిరంజీవి, సిబ్బంది ఉన్నారు.

గవర్నర్‌ టూర్‌ షెడ్యూల్‌ ఇలా..

- ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌నుంచి గవర్నర్‌ జిష్ణు దేవ్‌ వర్మ ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దత్తత గ్రామమైన కొండపర్తికి రోడ్డు మార్గాన బయలుదేరుతారు
- ఉదయం 11 గంటలకు కొండపర్తి గ్రామానికి చేరుకుంటారు
- 11 నుంచి 12.30 గంటల వరకు గవర్నర్‌ చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం, స్థానిక ఆదివాసీలతో గవర్నర్‌ మాటామంతి.
- మధ్యాహ్నం 12.30 గంటలకు కొండపర్తి నుంచి మేడారంలోని సమ్మక్క సారలమ్మ గుడికి రోడ్డు మార్గాన బయలుదేరుతారు.
- 12.45 నుంచి 1 గంట వరకు అమ్మవార్ల దర్శనాలు, మొక్కులు చెల్లించనున్నారు.
- 1 నుంచి 2 గంటల వరకు మేడారంలోని ఐటీడీఏ గెస్ట్‌ హౌజ్‌లో భోజన విరామం.
- 2 గంటలకు ఐటీడీఏ గెస్ట్‌ హౌజ్‌ నుంచి తిరిగి హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌కు రోడ్డు మార్గాన తిరుగు ప్రయాణం.
- సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకోనున్న గవర్నర్‌

కొండపర్తికి నేడు గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ

- ములుగు జిల్లా కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకున్న గవర్నర్‌
- అభివృద్ధి పనుల పరిశీలన అనంతరం సమ్మక్క-సారలమ్మ దర్శనం
- గిరిజన గ్రామాల్లో అభివృద్ధిపై సమీక్షించనున్న జిష్ణుదేవ్‌

సాక్షిప్రతినిధి, వరంగల్‌ : గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ మంగళవారం ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌ నుంచి బయల్దేరనున్న గవర్నర్‌.. దత్తత గ్రామం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామానికి రోడ్డు మార్గాన చేరుకుని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు మేడారంలోని ఐటీడీఏ గెస్ట్‌ హౌజ్‌లో భోజన విరామం తర్వాత హైదరాబాద్‌కు బయల్దేరుతారు. కాగా గవర్నర్‌ పర్యటన సందర్భంగా సోమవారం ములుగు కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, ఎస్పీ శబరీష్‌, అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్‌ దివాకర.. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

గవర్నర్‌ దత్తత శుభపరిణామం



అటవీ ప్రాంతంలో ఉన్న కొండపర్తి గ్రామాన్ని గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ దత్తత తీసుకోవడం సుభపరిణామం. సాగునీటి కోసం బోర్లు నిర్మిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో పంటలను సాగు చేసుకునే ఆలోచనలో ఉన్నాం.

- అరెం లచ్చుపటేల్‌, మేడారం జాతర చైర్మన్‌

ఆర్థికాభివృద్ధికి భరోసానివ్వాలి..



కొండపర్తి గ్రామాన్ని గవర్నర్‌ దత్తత తీసుకోవడం సంతోషంగా ఉంది. మహిళ కోసం కుట్టు మిషన్లు, కారం పొడి మిల్లు నెలకొల్పారు. మహిళలకు డైరీ ఫాంలు, పౌల్ట్రీఫాంలు నెలకొల్పితే కుటుంబాలకు ఆర్థికభరోసా ఉంటుంది.

- రజిత, కొండపర్తి

రోడ్డు నిర్మించాలి



కొండపర్తి స్టేజీ నుంచి గ్రామం వరకు రోడ్డును బాగు చేయాలి. గతంలో బీటీ రోడ్డు పనులను మొదలు పెట్టగా అటవీశాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు నిలిచిపోయాయి. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి.

- చింత కౌసల్య, కొండపర్తి